ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కరీంనగర్
జిల్లా వార్తలు
5
మంగళవారం 2 ఏప్రిల్ 2024

పెండింగ్‌లోనే కాంగ్రెస్ టికెట్

- ప్రవీణ్‌రెడ్డి వైపు మొగ్గు చూపినా మంత్రి పొన్నం అభ్యంతరాలతో వాయిదా
- రోజుకో మలుపు తిరుగుతున్న కరీంనగర్ అభ్యర్థి ఎంపిక



> హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ కోసం తన స్థానాన్ని త్యాగం చేశారు. ఆయనకే కాంగ్రెస్ కరీంనగర్ లోక్‌సభ టికెట్ ఇస్తారు.. కాంగ్రెస్ రాష్ట్ర ఎన్నికల కమిటీ నుంచి ఆయన పేరును మాత్రమే పంపించారు. ఆయన పేరును ప్రకటించడం లాంఛనమే..

> రాష్ట్రంలో రెడ్డి సామాజిక వర్గానికి కాంగ్రెస్ ఎక్కువ టికెట్లు కేటాయించింది. ఈ నేపథ్యంలో కరీంనగర్‌లో అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికి టికెట్ కేటాయించే పరిస్థితి లేదు. వెలమ సామాజికవర్గానికి టికెట్లు ఇవ్వనందున వెలిచాల రాజేందర్‌రావుకే టికెట్ దక్కే అవకాశం ఉంది. మంత్రి పొన్నం ప్రభాకర్ సహా జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల మద్దతు ఆయనకే ఉంది.

> రెడ్డి, వెలమ కాదు.. కాంగ్రెస్ అధిష్ఠానం కరీంనగర్ టికెట్‌ను బీసీ సామాజికవర్గానికి చెందిన తీన్మార్ మల్లన్నకు కేటాయిస్తుంది. ఈ మేరకు అధిష్ఠానం నిర్ణయానికి వచ్చింది.

ఇవీ కాంగ్రెస్ కరీంనగర్ టికెట్‌పై కొనసాగిన ఊహాగానాలు. లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక ప్రారంభమైనప్పటి నుంచి కరీంనగర్ టికెట్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. రోజుకో అభ్యర్థి తెరపైకి వస్తున్నాడు. అభ్యర్థి ఖరారయ్యాడనుకునే లోపు అధిష్ఠానం పెండింగ్‌లో పెడుతోంది. తాజాగా సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలోనూ అభ్యర్థిని ఖరారు చేయలేదు..

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికను ఆ పార్టీ అధిష్ఠానం పెండింగ్‌లోనే ఉంచింది. ఇప్పటికి మూడు విడతల్లో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశాలు జరిగినా ఏ విషయం తేల్చలేదు. తాజాగా సోమవారం జరిగిన సమావేశంలోనూ ఏ నిర్ణయానికి రాలేకపోయారు. ఒకదశలో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికి టికెట్ ఖరారయ్యిందని ప్రచారం జరిగింది. చివరి నిమిషంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవీణ్‌రెడ్డి అభ్యర్థిత్వంపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విడతలో రాష్ట్రంలో వరంగల్ అభ్యర్థిని ఎంపిక చేసిన కాంగ్రెస్ అధిష్ఠానం హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్ స్థానాలను పెండింగ్‌లో పెట్టింది.

● పోటాపోటీగా ప్రయత్నాలు

కాంగ్రెస్ రాష్ట్ర ఎన్నికల కమిటీ నుంచి కరీంనగర్ స్థానానికి ప్రవీణ్‌రెడ్డి పేరును మాత్రమే పంపించారు. కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశాల్లో ప్రవీణ్‌రెడ్డి పేరుతోపాటు వెలిచాల రాజేందర్‌రావు, రుద్ర సంతోష్‌కుమార్, తీన్మార్ మల్లన్న పేర్లు పరిశీలనలోకి వచ్చాయి. గతంలో జరిగిన ఎన్నికల కమిటీ సమావేశం సందర్భంగా జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ మరో ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక నియోజకవర్గ ఇన్‌చార్జి ఏకాభిప్రాయంగా వెలిచాల రాజేందర్‌రావును ప్రతిపాదించారు. దీంతో రాజేందర్‌రావు పేరు ఖరారు అయినట్లు ప్రచారం జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టడానికి కార్యాచరణ సిద్ధం చేశారంటూ వార్తలు వచ్చాయి. ఇంతలో సోమవారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పేరునే ఖరారు చేశారంటూ ప్రచారం జరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రవీణ్‌రెడ్డి హుస్నాబాద్ శాసనసభ స్థానం నుంచి పోటీ చేయడానికి టికెట్ ఆశించారు. కరీంనగర్ నుంచి తన స్థానాన్ని హుస్నాబాద్‌కు మార్చుకున్న పొన్నం ప్రభాకర్‌కు అవకాశం కల్పించడానికి ప్రవీణ్‌రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోజు సర్దిచెప్పారు. ఎమ్మెల్సీ పదవికాని, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కానీ కల్పిస్తామని హామీ ఇచ్చి ఆయనను అసెంబ్లీ టికెట్ బరి నుంచి ఉపసంహరించుకునేలా చూశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాను ఇచ్చిన హామీ మేరకు ప్రవీణ్‌రెడ్డికే కరీంనగర్ పార్లమెంట్ స్థానం అభ్యర్థిత్వం ఇవ్వాలని ప్రతిపాదించారు. ఆయన సూచన మేరకే రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల కమిటీ ఏకాభిప్రాయంగా ప్రవీణ్‌రెడ్డి పేరు మాత్రమే కేంద్ర ఎన్నికల కమిటీకి పంపించింది. ఢిల్లీ స్థాయిలో మాత్రం పలువురి పేర్లను పరిశీలించి పలు సర్వేలు చేయించుకొని పలు సమావేశాల్లో చర్చించారు. అయినా నిర్ణయానికి రాలేక పోయారు.

● ఎవరికి దక్కుతుందో..?

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హుస్నాబాద్ టికెట్ ఇచ్చిన సమయంలో ప్రవీణ్‌రెడ్డికి ఇచ్చిన హామీ మేరకు తొలుత ఎవరికీ మద్దతు తెలపలేదు. చివరి దశలో వెలిచాల రాజేందర్‌రావుకు అండగా ఎమ్మెల్యేలను కూడగట్టి ఆయనకే టికెట్ ఇవ్వాలని ప్రతిపాదించారు. దీంతో గత సమావేశంలో ఆయన పేరు ఖరారవుతుందని, మార్చి 31న జరిగే సమావేశంలో పేరు ప్రకటిస్తారని భావించారు. ఆ సమావేశం సోమవారానికి వాయిదాపడింది. సోమవారం జరిగిన సమావేశంలో ప్రవీణ్‌రెడ్డి అభ్యర్థిత్వంపై పొన్నం ప్రభాకర్ అభ్యంతరాలు తెలిపినట్లు తెలిసింది. నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జి రాజేందర్‌రావుకు మద్దతు తెలుపుతుండగా ప్రవీణ్‌రెడ్డికి టికెట్ ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించనట్లు సమాచారం. తమ అభిప్రాయాలను కాదని ఆయనకే టికెట్ ఇస్తే తమ నుంచి సహకారం ఉండదని చెప్పినట్లు తెలిసింది. తాము మద్దతు ఇస్తున్న రాజేందర్‌రావుకు టికెట్ ఇస్తే ఆయన గెలుపు బాధ్యతను తమదని స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో అధిష్ఠానం పునరాలోచనలో పడి ప్రస్తుతానికి అభ్యర్థిని ప్రకటించకుండా పెండింగ్‌లో ఉంచినట్లు తెలిసింది. కాంగ్రెస్ టికెట్ వ్యవహారంపై ఆ పార్టీలోనే కాకుండా ప్రత్యర్థి పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీల్లోనూ ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

బల్దియా దుకాణాల కేటాయింపు

అటకెక్కినట్లేనా?

- కోర్టు ఉత్తర్వులు బేఖాతరు
- వీధి వ్యాపారుల నిరీక్షణ
- మున్సిపల్ ఆదాయానికి గండి
- 151 దుకాణాలకు 1,070 మంది దరఖాస్తు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 1: నగరపాలక సంస్థ లక్షలు వెచ్చించి నిర్మించిన వాణిజ్య సముదాయాల దుకాణాల కేటాయింపును అటకెక్కించారు. దీంతో మున్సిపల్ కార్పొరేషన్‌కు రావలసిన ఆదాయానికి గండి పడుతోంది. ఈ దుకాణాలను తీసుకుని తమ వ్యాపారాలను వృద్ధి చేసుకోవాలనుకున్న చిరు వ్యాపారుల ఆశలు అడియాశలయ్యాయి. జిల్లా కేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలోని బల్దియా షెట్టర్లను తీసుకునేందుకు వ్యాపారులు పోటీపడ్డారు. లాటరీ ద్వారా దుకాణాలను కేటాయిస్తామని వ్యాపారుల నుంచి గత నెలలో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. మార్చి 5న లాటరీ తీసి దుకాణాలను



కేటాయిస్తామని ప్రకటించారు. అనివార్యకారణాల వల్ల లాటరీని వాయిదా వేశామని, త్వరలోనే నిర్వహించి దుకాణాలను కేటాయిస్తామని అధికారులు ప్రకటించారు.

● నెల రోజులు గడిచినా..

దుకాణాల కేటాయింపు కోసం నిర్వహించాల్సిన లాటరీని వాయిదా వేసి నెల రోజులు గడిచినా అధికారులు ఎలాంటి ప్రకటన చేయక పోవడంతో వీధి వ్యాపారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. నగరపాలక సంస్థ ఆదాయ మార్గాలను పెంచుకునేందుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి మూడు వైపులా 126 దుకాణాలతో వాణిజ్య సముదాయాన్ని నిర్మించింది. శాతవాహన యూనివర్సిటీ సమీపంలో 25 దుకాణాలతో మరో సముదాయాన్ని నిర్మించింది. 151 దుకాణాలను నామమాత్రపు అద్దెలతో చిరు వ్యాపారులకు కేటాయించేందుకు లాటరీ నిర్వహిస్తామని, దుకాణాలు తీసుకోవాలనుకునే వారు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ప్రకటన జారీ చేశారు. 1,070 మంది వెయ్యి రూపాయిల డీడీని జత చేసి సమర్పించారు. మార్చి 5న లాటరీ నిర్వహించి దుకాణాలను కేటాయిస్తామని ప్రకటించిన అధికారులు వాయిదా వేశారు. దుకాణాల కేటాయింపు కోసం నోటిఫికేషన్ ఇవ్వడంతో పలువురు చిరు వ్యాపారులు చాలా రోజులుగా ఆయా ప్రాంతాల్లో వ్యాపారం చేసుకొని జీవిస్తున్నామని, తమకు దుకాణాలను కేటాయించి ఉపాధి కల్పించాలని కోరారు. వారిలో కొందరు హైకోర్టును ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని కోరారు. దీంతో కోర్టు స్థానికంగా గతంలో దుకాణ సముదాయాల నిర్మాణాలకు ముందు ఉన్న వీధి వ్యాపారులు 75 మందికి దుకాణాలను కేటాయించి మిగిలిన వాటిని లాటరీ పద్ధతిలో కేటాయించాలని, ఈ ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఆదేశించి 15 రోజులు దాటినా వాటిని వ్యాపారులకు కేటాయించడం లేదు. దీంతో కోర్టు ఆదేశాలను కూడా అధికారులు పట్టించుకోవడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికైనా నిరుపయోగంగా ఉన్న దుకాణాలను తమకు కేటాయించి న్యాయం చేయాలని వ్యాపారులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

చొప్పదండి, ఏప్రిల్ 1: ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మండలంలోని వెదురుగట్టులో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనాలని, గోనె సం చుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఏవో శ్రీనివాస్, డీసీఎస్‌వో గౌరిశంకర్, డీఎం రజినీకాంత్, డీపీఎం ప్రవీణ్, ఏపీఎం నర్మద పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

● ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలి

గంగాధర: ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సోమవారం గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గంలోని పీవోలు, ఏపీవోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలు తప్పని సరిగా పాటించాలని, ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పని చేయాలన్నారు. పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ ముగిసిన తరువాత ఈవీఎంలను, సామగ్రిని జాగ్రత్తగా తీసుకెళ్లాలని సూచించారు. పోలింగ్ రోజున తెల్లవారు జామున మాక్ పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అన్ని సరి చూసుకున్న తరువాత ఎన్నికల సమయానికి ఏలాంటి ఆటంకం లేకుండా అసలు పోలింగ్ ప్రారంభించాలన్నారు. మొదట మాక్ పోలింగ్ నిర్వహిస్తే ఎదురయ్యే ఇబ్బందులు తెలుస్తాయన్నారు. అసెంబ్లీ ఎన్నికలు విజయవంతంగా పని చేసిన విధంగానే, పార్లమెంటు ఎన్నికల్లో పని చేయాలని సూచించారు. ఏవైనా ఇబ్బందులు, సందేహాలు వస్తే అధికారులను సంప్రదించాలని సూచించారు. సొంత నిర్ణయాలు తీసుకుని ఇబ్బందులు పడవద్దని అన్నారు. పోలింగ్ పూర్తయిన తరువాత ఈవీఎంలను జాగ్రత్తగా చూసుకుని క్లోజ్ చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్క సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేలా సిబ్బంది సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, గంగాధర, చొప్పదండి, కొడిమ్యాల తహసీల్దార్లు రమేష్‌బాబు, నరేందర్, రాజమణి పాల్గొన్నారు.



గంగాధరలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

రైతులకు భరోసా ఇచ్చేందుకు దీక్ష

- బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 1: సాగునీరు లేక రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, వారికి భరోసా కల్పించేందుకే రైతు దీక్ష నిర్వహిస్తున్నామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో ఎన్నికల నిర్వహణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, రైతులకు అండగా నిలవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందన్నారు. రైతులకు భరోసా కల్పించడానికి రైతు దీక్ష చేపడుతున్నామన్నారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేపీ శ్రేణులు పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ విధానాలనే అవలంబిస్తోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నో హామీలిచ్చి నెరవేర్చలేదన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, ఎకరాకు 15 వేల రైతు బంధు, కౌలు రైతులకు రైతు బంధు ఏమైందని ప్రశ్నించారు. కుంటి సాకులు చెప్పకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ రామడుగు వచ్చి పంట నష్టం ఇస్తానని చెప్పాడని, ఇప్పటి వరకు రైతులకు పరిహారం అందలేదన్నారు. కేసీఆర్‌కు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కరీంనగర్ రైతులకు క్షమాపణ చెప్పిన తరువాతనే కేసీఆర్ ఇక్కడ అడుగు పెట్టాలన్నారు. సమావేశంలో ఎస్ కుమార్, మీసాల చంద్రయ్య, గంగాడి కృష్ణారెడ్డి, బోయినపల్లి ప్రవీణ్‌రావు, డి శంకర్ పాల్గొన్నారు.




ఎన్నికల నిర్వహణకమిటీ సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

ఎస్సెస్సీ వొకేషనల్ పరీక్షలకు 16 మంది గైర్హాజరు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 1: ఎస్సెస్సీ వొకేషనల్ పరీక్షలకు 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, 1,184 మంది పరీక్షలు రాశారని సీహెచ్‌వీఎస్ జనార్దన్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా ఎనిమిది కేంద్రాల్లో తని ఖీలు నిర్వహించామన్నారు. జిల్లాలో పదో తరగతి జనరల్, వొకేషనల్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని, ఇందుకు సహకరించిన ప్రతి ఉద్యోగికి విద్యాశాఖ పక్షాన డీఈవో కృతజ్ఞతలు తెలిపారు.

● రేపటి నుంచి మూల్యాంకనం

జిల్లా కేంద్రంలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బుధవారం నుంచి పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకణం నిర్వహించేం దుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో జనార్దన్‌రావు తెలిపారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:28 మంగళవారం
సహర్ 4:39 బుధవారం

తాగునీటి కొరత రాకుండా చూడాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 1: వేసవి కాలం నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటికి కొరత రాకుండా కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఆమె కలెక్టర్లతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కోసం కలెక్టర్లు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. అవసరం ఉన్నచోట బోర్ వెల్స్, పైప్ లైన్స్ వేయించాలని సూచించారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలు, మండలాలు, గ్రామాల వారీగా స్పెషల్ ఆఫీ సర్లు అందుబాటులో ఉంటూ పరిస్థితిని సమీక్షించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గోనె సంచుల కొరత లేకుండా చూడాలని, రైతులకు మద్దతు ధర కల్పించాలన్నారు. జూన్ 10లోగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు అన్ని కల్పించి ఉత్తమంగా తీర్చిదిద్దాలన్నారు. వేసవి సెల వులు పూర్తయ్యేలోగా పనులన్నీ పూర్తి చేయాలని తెలిపారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సూచిం చారు కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, వ్యవసాయ అధికారి శ్రీనివాస్, డీఈవో జనార్దన్ రావు, డీపీవో రవీందర్, పౌరసరఫరాల డీఎం రజనీకాంత్, డీసీఎస్ఓ గౌరీ శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అంజన్‌రావు పాల్గొన్నారు.



ఎండలు మండే కాలం

జాగ్రత్తలు తీసుకోవాలంటున్న డాక్టర్లు


సుభాష్‌నగర్, ఏప్రిల్ 1: ఎండల తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిపోవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో వేసవి ఎండల తీవ్రతను తట్టుకునేందుకు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వేసవికాలంలో ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశ ఉంటుంది. వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా ఉన్నాయి.

వడదెబ్బ లక్షణాలు



- తీవ్రమైన తలనొప్పి
- నాడి వేగంగా కొట్టుకోవడం
- నాలుక ఎండిపోవడం
- విపరీతంగా చెమటపట్టి శరీరంలోని నీటిని కోల్పోవడం
- పాక్షిక లేకా పూర్తి అపస్మారక స్థితికి చేరడం

ప్రథమ చికిత్స




- వడదెబ్బకు గురైన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి తరలించాలి.
- శరీరానికి చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవాలి
- వడదెబ్బ తగిలిన వారికి ఉప్పు, మజ్జిగ, కొబ్బరి నీళ్ళు, గ్లూకోజ్, ఇతర లవణాలు(ఓఆర్ఎస్) కలిపిన నీటిని తాగించాలి.
- ప్రథమ చికిత్స చేసి వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, లేదా ఏదైన ఆసుపత్రికి తరలించాలి.

జాగ్రత్తలు

- తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, క్యాప్, తలపై వస్త్రం తప్పక ధరించాలి.
- తెల్లని నూలు దుస్తులను ధరించాలి.
- ఎండ తీవ్రంగా ఉన్నపుడు బయట తిరగవద్దు.
- నీరు, ఇతర ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి
- మత్తు పానీయాలు తీసుకోవద్దు.









రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విద్యార్థిని

తిమ్మాపూర్, ఏప్రిల్1: మండలంలోని ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని ఓ విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లాకు చెందిన ఉప్పాల శ్రీహర్ష అనే విద్యార్థిని స్థానికంగా ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ సమీపంలోని ఓ గర్ల్స్ హాస్టల్‌లో ఉంటోంది.

సోమవారం రాత్రి హాస్టల్ నుంచి బయటికి వచ్చి రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతుండగా కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపునకు వెళ్తున్న ఓ యువకుడు బైక్‌ను అతివేగంగా నడుపుతూ ఆ విద్యార్థిని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో శ్రీహర్షకు తీవ్రగా యాలు కాగా స్థానికులు, ఎల్ఎండి పోలీసులు 108 వాహనంలో కరీంన గర్‌లోని ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 1: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,450 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 41మంది రైతులు 466క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,450, కనిష్ఠ ధర రూ.7వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఆలయాల్లో దొంగతనం

ఇబ్రహీంపట్నం, ఎప్రిల్ 1: మండలంలోని వర్షకొండ గ్రామంలో పలు దేవాలయల్లో అర్ధరాత్రి దొంగతనం జరిగినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, బ్రహ్మం గారి ఆలయం, పెద్దమ్మ, పంచముఖ, హన్‌మాన్ ఆలయలలో తాళాలు పగులగొట్టి దొంగతనం చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దాదాపుగా 3.5 గ్రాముల బంగారు అభరణాలు దొంగిలించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుల బైండోవర్

శంకరపట్నం, ఏప్రిల్ 1: శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీసులు సోమవారం బెల్ట్ షాపు నిర్వాహకులను తహసీల్దార్ కార్యాలయంలో హాజరు పరిచి బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని గద్దపాక, కాచాపూర్, రాజాపూర్, కన్నాపూర్, ధర్మారం గ్రామాలకు చెందిన 16మందిని తహసీల్దార్ కార్యాలయంలో హాజరు పరిచినట్లు తెలిపారు.







'నవోదయ' ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదల

చొప్పదండి,ఏప్రిల్1: నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదలైనట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. గత జనవరి 20న ఉమ్మడి జిల్లా స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించగా మెరిట్, కేటగిరీ వారీగా ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేశారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 5న ఆధార్ కార్డు, హాల్‌టికెట్, ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో విద్యాలయంలో హాజరు కావాలని ఆమె తెలిపారు.

రాజరాజేశ్వర క్షేత్రంలో భక్తుల రద్దీ


భక్తులతో సందడిగా ఉన్న ఆలయ ప్రాంగణం


కోడె మొక్కు చెల్లించుకుంటున్న మంత్రి కొండా సురేఖ

వేములవాడ, ఏప్రిల్ 1: వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం సోమవారం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం సైతం భక్తులతో భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి కృష్ణప్రసాద్ నేతృత్వంలో అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

కల్యాణం టికెట్ల కోసం భక్తుల ఇబ్బందులు

రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో స్వామివారి నిత్య కల్యాణం టికెట్ల కోసం భక్తులు ఇబ్బందులు పడ్డారు. శివ కల్యాణం ఉత్సవాల సందర్భంగా గత ఐదు రోజులుగా స్వామివారి నిత్య కల్యాణం టికెట్లు నిలిపి వేయగా, కల్యాణోత్సవాలు ముగిసిన నేపథ్యంలో సోమవారం స్వామివారి నిత్య కల్యాణం యథావిధిగా ప్రారంభించారు. కల్యాణంలో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ముందు భాగంలోని కళాభవన్ మొదటి అంతస్తులో స్వామివారి నిత్య కల్యాణం నిర్వహిస్తారు. ఈ ప్రాంగణంలో పరిమిత సంఖ్యలోనే భక్తులు స్వామివారి కల్యాణంలో పాల్గొనడానికి వీలవుతుంది. గరిష్ఠంగా 180 టికెట్ల వరకు మాత్రమే జారీ చేస్తారు. కల్యాణోత్సవం టికెట్లు విక్రయం ప్రారంభించిన కొద్దిసేపట్లోనే టికెట్లు దాదాపుగా అయిపోయాయి. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అనేకమంది భక్తులు కల్యాణోత్సవం టికెట్ల కోసం ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ టికెట్ దొరకక పోవడంతో నిరాశకు గురయ్యారు. ఇదిలా ఉండగా సోమవారం స్వామివారి కోడె మొక్కు చెల్లింపు కోసం సైతం పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఆలయ గుడి చెరువు పార్కింగ్ స్థలం నుంచి ప్రారంభమైన క్యూలైన్‌లో భక్తులు కిక్కిరిసిపోయారు. కోడె మొక్కు చెల్లింపు కోసం భక్తులు రెండు నుంచి మూడు గంటలకు పైగా వీక్షించాల్సి వచ్చింది.

రాజన్న సేవలో మంత్రి కొండా సురేఖ

వేములవాడ: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి సేవలో తరించారు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి స్వామివారి ప్రసాదం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఆమె వెంట ఉన్నారు.

ఉపాధి పనుల్లో కూలీకి తీవ్రగాయాలు

గంభీరావుపేట, ఏప్రిల్ 1: గంభీరావుపేట మండలం గోరంటాలలో సోమవారం ఉపాధి పనుల్లో కూలీకి తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బండ సత్తవ్వ రోజు మాదిరిగానే ఉపాధి పనికి వెళ్లింది. పనులు చేస్తుండగా సత్తవ్వ చేతిపై పార బలంగా తగలడంతో ఎడమ చేతి నాలుగు వేళ్లు అక్కడే తెగిపడ్డాయి. తీవ్రంగా గాయపడటంతో ముందుగా సిరిసిల్ల అక్కడి నుంచి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి ఒకరికి తీవ్రగాయాలు

● రోడ్డుపై ధాన్యం కుప్పలతో ఘటన

వీర్నపల్లి, ఏప్రిల్ 1 : వీర్నపల్లి మండలం శాంతినగర్ గ్రామ శివారులో ప్రధాన రహదారిపై వరిధాన్యం కుప్ప ఎక్కడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి గంగాధర మండలానికి చెందిన భాస్కర్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గంగాధర నుంచి సిరికొండ వైపు వెళ్తున్న భాస్కర్ రోడ్డుపై పోసిన వరి ధాన్యం కుప్పలను ఎక్కించడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో చికిత్స కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

యువతి ఆత్మహత్య

పెగడపల్లి, ఏప్రిల్1: మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన పూసల వైష్ణవి (20) అనే యువతి క్రిమిసంహారక మందు తాగి ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిగ్రీ చదువుతున్న వైష్ణవి పరీక్షల్లో ఫెయిలయ్యానని బాధతో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. వైష్ణవి తండ్రి రాజేశం ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జాడి రామకృష్ణ తెలిపారు.

ఘనంగా ఉగ్ర నారసింహుని ఏకాంతోత్సవం


ఉగ్ర నారసింహుని ఆలయంలో పూజలు



శేషప్ప కళావేదికపై చిన్నారుల నృత్య ప్రదర్శన

ధర్మపురి, ఏప్రిల్ 1: ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (ఉగ్ర)వారల ఏకాంతోత్సవం సోమవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు రాత్రి వేళలో అందంగా పూలతో అలంకరించిన స్వామివారలకు ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అర్ధరాత్రి స్వామివారల ఉత్సవ మూర్తులను వేదిక వద్దకు తీసుకవెళ్లారు. అనంతరం స్వామి వారలను పవళింపజేసి ఏకాంతోత్సవం నిర్వహించారు. దీంతో శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ముగిశాయి. యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు నేతృత్వంలో అర్ధరాత్రి వరకు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు దర్శనం చేసుకుని ఉత్సవాన్ని తిలకించారు. అంతకు ముందు శేషప్ప కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన శ్రీ సాయి సన్నిధి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులచే నృత్య ప్రదర్శనలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి. కల్వచర్ల సీహెచ్ విష్ణు బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని అధిగమించిన ఎన్టీపీసీ

2023-24లో 16,645 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి


రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు

జ్యోతినగర్, ఏప్రిల్ 1: రామగుండం ఎన్టీపీసీ 2023-24 ఆర్థిక సంవత్సర విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించింది. ఈ ఆర్థిక సంవత్సరం 16,600 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా(ఎంఓయూ) నిర్ణయించగా మార్చి 26న ప్రాజెక్టు టార్గెట్‌ను సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రాజెక్టులో కొన్ని సాంకేతిక, వార్షిక మరమ్మతులు తదితర అవాంతరాలు ఎదురైనప్పటికీ లక్ష్యాన్ని సాధించడం విశేషం. ప్రాజెక్టులోని 500 మెగావాట్ల 7వ యూనిట్ నిరంతరాయంగా 305 రోజులపాటు విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నది. ఇన్ని రోజులపాటు యూనిట్ నిరాటంకంగా విద్యుత్ ఉత్పత్తిని కొనసాగించడం రికార్డుగా అధికారులు తెలిపారు. అలాగే 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ కేంద్రం 2023-24 ఆర్థిక సంవత్సరంలో 196.17 మిలియన్ యూనిట్ల రికార్డు విద్యుత్ ఉత్పత్తి నమోదైంది.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

● బీజేపీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ఎస్.కుమార్


యువత నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న కమిటీ సభ్యులు

భగత్‌నగర్, ఏప్రిల్ 1: దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి, మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ఎస్.కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని శుభమంగళ గార్డెన్స్‌లో జరిగిన బీజేపీ మేనిఫెస్టో కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ మేనిఫెస్టోలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. దేశానికి ఏది అవసరమో యువత గుర్తించి లిఖిత పూర్వకంగా అందించాలన్నారు. పదేళ్లుగా దేశంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేసిందన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేస్తోందన్నారు. మేనిఫెస్టోలో యువత భాగస్వామ్యం కోసం 17 పార్లమెంట్‌నియోజక వర్గాల్లో అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా సేకరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ యువత సూచనలు తీసుకుని బీజేపీ ప్రజా మేనిఫెస్టో రూపొందిస్తుందన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ ప్రభారి మీసాల చంద్రయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేష్, గంద్రనళిని, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దుర్శటి సంపత్, మాజీ మేయర్ డి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ అనాలోచిత నిర్ణయంతోనే సాగు నీటి ఎద్దడి

● ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 1: రబీ పంటల సాగు కోసం నీటి విడుదలకు సరైన ప్రణాళికలు రూపొందించకపోవడంతో పాటు కేసీఆర్ అనాలోచిత నిర్ణయంతోనే సాగు నీటి ఎద్దడి ఏర్పడిందని దీనికి పూర్తిగా కేసీఆరే నైతిక బాధ్యత వహించాలని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో సోమవారం జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న నాయకులు ఇతర పార్టీలోకి వెళ్లడానికి కేసీఆర్ నిర్ణయాలు, ఎన్నికల ఫలితాల పతనమే కారణమన్నారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు, ప్రజల దృష్టిని మరల్చేందుకు కేసీఆర్ ఇప్పుడు జిల్లాల పర్యటన పేరుతో పంటల పరిశీలన చేయడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి భవిష్యత్‌లో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి పంటల బీమా పథకం అమలు చేసేలా చర్యలు చేపడుతున్నారన్నారు. గడిచిన ఐదేళ్ల లో పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేయని కేసీఆర్ ఇపుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే రుణ మాఫీ ఏమైందని అడుగడం హాస్యాస్పదమన్నారు. బీజేపీకి రైతు సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ కనుమ రుగు కాబోతుందన్నారు. రాష్ట్ర ఖజానాను కేసీఆర్ ఖాళీ చేశాడని దీంతో రాష్ట్రం పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయిందన్నారు.

పంటలు ఎండిపోవడానికి కేసీఆరే పూర్తి బాధ్యుడని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. ధర్మపురి నియోజకవర్గ సమస్యలపై రాష్ట్ర మంత్రిగా వ్యవహరించిన ఈశ్వర్ ఏనాడైనా కేసీఆర్ దృష్టికి తీసుకవెళ్లాడా అని ప్రశ్నించారు. రైతులపై కపట ప్రేమ చూపించేందకు గాను దొంగ దీక్ష చేపట్టడం సరైంది కాదన్నారు. రాజకీయంగా పేరు తెచ్చిన ఉమ్మడి కరీంనగర్‌కు కేసీఆర్ ఏమి చేయలేదన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్త మోహన్, క్లబ్ సెక్రటరీ పుప్పాల అశోక్, ఫ్లోర్ లీడర్ దుర్గయ్య ఉన్నారు.

అక్షర చిట్‌ఫండ్స్‌పై మరో కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 1: చిట్ డబ్బులు ఇవ్వకుండా, వడ్డీ చెల్లిస్తామని డిపాజిట్ చేయించుకుని మోసం చేసినట్లు వచ్చిన ఫిర్యాదుతో కరీంనగర్‌లోని అక్షర చిట్‌ఫండ్స్‌పై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. కొద్ది రోజుల క్రితం అక్షర చిట్‌ఫండ్స్ యాజమాన్యంపై కేసులు నమోదుకాగా, ఎండీ, డైరెక్టర్లను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపల్లికి చెందిన మిట్టపల్లి భాగ్య అనే మహిళ 2019లో రాజీవ్‌చౌక్‌లోని అక్షర చిట్‌ఫండ్స్‌లో 5 లక్షల చిట్ వేసి, లిఫ్ట్ చేయగా ఆమెకు 3,87,418 రూపాయలు వచ్చాయి. ఆ డబ్బులను చెల్లించకుండా ఖతాదారుకు మాయమాటలు చెప్పి అక్షర టౌన్‌షిప్ సంస్థలో డిపాజిట్ చేస్తే 18 శాతం వడ్డీ ఇస్తామని 4 లక్షల రూపాయలు డిపాజిట్ చేయించుకున్నారు. అప్పటి నుంచి ప్రతి నెల 6 వేల వడ్డీ 2023 సంవత్సరం నుంచి చెల్లించడం లేదు. అలాగే భాగ్య కూతురు, మరి కొందరు బంధువులను కూడా అక్షర చిట్‌ఫండ్స్ యజమాని, డైరెక్టర్లు ఇలాగే మోసం చేశారని బాధితురాలు సోమవారం కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అక్షర చిట్‌ఫండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ పేరాల శ్రీనివాసరావు, డైరెక్టర్లు శ్రీవిద్య, ఎస్ కొండల్‌రావు, పుప్పాల రాజేందర్, గోనె రమేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎంపీటీసీపై అట్రాసిటీ కేసు

మల్యాల, ఏప్రిల్ 1: మండలంలోని బల్వంతాపూర్ ఎంపీటీసీ సంగని రవిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. మల్యాల ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి 16న మండలంలోని మ్యాడంపల్లి శివారులో మల్యాల ఎంపీపీపై అవిశ్వాస సమావేశం గురించి చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో పలువురు ఎంపీటీసీలు పాల్గొనగా ఎంపీపీ అవిశ్వాస తీర్మానంపై మాట్లాడుకుంటుండగా ఎంపీటీసీ రవి నూకపల్లి ఎంపీటీసీ భర్త మారంపల్లి నారాయణను కులం పేరుతో దూషిస్తూ చంపుతానని బెదిరించాడు. ఆదివారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. 2న ఎంపీపీ అవిశ్వాస సమావేశం ఉండగా ఎంపీటీసీపై కేసు నమోదు కావడం చర్చణీయాంశంగా మారింది

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నలుగురికి జైలు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 1: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నలుగురు వ్యక్తులకు జైలుశిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 20మంది వాహనదారులను పోలీసులు సోమవారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఒకరికి 10 రోజులు జైలు శిక్ష, మరొకరికి 7 రోజులు, ఇద్దరికి 3 రోజుల జైలుశిక్ష, ముగ్గురికి కలిపి 10 వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. మిగతా 16 మంది వాహనదారులకు 23 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 1: మండలంలోని రాజేశ్వర్‌రావుపేట గ్రామ శివారులోని వరద కాలువ బ్రిడ్జి వద్ద సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో కథలాపూర్ మండలంలోని పోతారం గ్రామానికి చెందిన వెలుమల దీక్ష(20) అనే యువతి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దీక్ష నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి గ్రామంలో ఉన్న తన అక్క ఇంటికి వెళ్లింది. తన బావ కొత్తపల్లి దీలిప్‌తో కలిసి ద్విచక్రవాహనంపై పోతారం తిరిగి వస్తుండగా మండలంలోని రాజేశ్వర్‌రావుపేట వరద కాలువ బ్రిడ్జి వైపు వస్తున్న టిప్పర్ ఒక్కసారిగా జాతీయ రహదారిపైకి వేగంగా వచ్చి నిర్లక్ష్యంగా యూటర్న్ తీస్తుండగా బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వెనుకాల కూర్చున్న దీక్ష టిప్పర్ టైర్ల కింద పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ అనిల్ తెలిపారు. బావ దీలిప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పెర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


పిట్టల సంపత్

మానకొండూర్, ఏప్రిల్ 1: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన పిట్టల సంపత్ (36) అనే రైతు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లింగాపూర్‌కు చెందిన సంపత్ గ్రామంలో రెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటున్నాడు. రెండు రోజులుగా వ్యవసాయ బావి మోటార్ పనిచేయకపోవడంతో అదే గ్రామంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ఆఫ్ చేసే క్రమంలో విద్యుదాఘాతంతో పడిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య పిట్టల మమత ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

● పరారీలో మరో నిందితుడు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 1 : మహిళ హత్య కేసులో ఒక నిందితుడిని అరెస్ట్ చేయగా మరో నిందితుడు పరారీలో ఉన్నాడని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. బీహార్‌కు చెందిన ఇద్దరు 6 నెలల క్రితం కూలి కోసం సిరిసిల్లకు వచ్చారన్నారు. సిరిసిల్లలోని అశోక్‌నగర్‌లో గది అద్దెకు తీసుకొని పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. రుడల్ సదా, రామ్విక్రస్ సదా ఇద్దరు కూలి చేసే వద్ద వేములవాడ అర్బన్ మండలానికి చెందిన ఓ మహిళతో పరిచయం పెంచుకున్నారు. మార్చి 19న సాయంత్రం 6 గంటలకు కూలి పని అయిన తర్వాత ఆమెను రూమ్‌కి తీసుకెళ్లారు. మహిళ,ఇద్దరు కార్మికులు మద్యం తాగి అదే మత్తులో ఒకరు లైంగిక కోరిక తీర్చుకొని మరొకరు అనుభవించే క్రమంలో ఆమె మత్తు నుంచి తేరుకోవడంతో ప్రతిఘటించడంతో ఎవరికైనా విషయం చెప్తుందనే అనుమానంతో రూమ్‌లో ఉన్న సిలిండర్ బుడ్డితో ఆమె తలపై కొట్టి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బీహార్‌కు పారిపోయారని తెలిపారు. ఈ హత్యపై సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి డీఎస్పీ ఆధ్వర్యంలో సిరిసిల్ల టౌన్ సి.ఐ రఘుపతి, టాస్క్‌ఫోర్స్ సి.ఐ ప్రవీణ్‌కుమార్, ఎల్లారెడ్డిపేట్ ఎస్.ఐ రమాకాంత్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో స్పెషల్ టీం ఏర్పాటు చేసి, బీహార్ రాష్ట్రం ఖగారియా జిల్లా అనాపూర్ మారన్ గ్రామానికి చెందిన రామ్విక్రస్ సదా (37)ను అరెస్టు చేశామన్నారు. మరోనిందితుడైన రుడల్ సదా పరారీలో ఉన్నాడని ఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేష్‌నగర్, ఏప్రిల్ 1: నగరంలోని వల్లంపహాడ్ 11 కెవి ఫీడర్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం 3గంటల నుంచి 5 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏడీఈ కొల్పుల రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

● నగరంలోని మెహర్‌నగర్ 11 కెవి ఫీడర్ పరిధిలోని ఏరియాలలో మంగళవారం ఉదయం 8గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఏడీఈ సాయినేని నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మెహర్‌నగర్, ఎన్‌సీసీ కార్యాలయం వెనుకవైపు, సీతారాంపూర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

వైద్య కళాశాలలో నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 1: కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిన ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 3వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. అభ్యర్థులు 4వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రభుత్వ వైద్య కళాశాల కరీంనగర్‌లో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

ఓటర్లకు అవగాహన కల్పించాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 1: ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ బి శ్రీనివాస్ అన్నారు. సోమవారం నగరంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరించాలన్నారు. ఆర్పీలు తమ సంఘ సభ్యులు, వారి కుటుంబ సభ్యుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు.

కేజీబీవీలో ఎప్‌సెట్ శిక్షణ

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 1: కరీంనగర్ కేజీబీవీలో ఎప్‌సెట్ శిక్షణను ఆదివారం డీఈవో జనార్దన్‌రావు ప్రారం భించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జీసీడీవోలు కృపారాణి, పద్మజ, కవిత, అనుపమ మరియు కేజీబీవీ కరీంనగర్ ఇన్‌చార్జి ప్రత్యేక అధికారి పుష్పరాణి పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు



నగరంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 1: ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కేంద్రబలగాల సేవలు వినియోగించుకుంటున్నామని సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు. కరీంనగర్ మూడో ఠాణా పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం కేంద్ర బలగాలు(సీఐఎస్ఎఫ్) ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. గాంధీ చౌరస్తాలో ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ కిసాన్‌నగర్, ప్రవిష్టరోడ్, కార్ఖానగడ్డ, నాకా చౌరస్తా వరకు కొనసాగింది. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ నరేందర్, సీఐఎస్ఎఫ్ కంపెనీ కమాండర్ విక్రాంత్, అసిస్టెంట్ కమాండర్ విజేందర్ పాల్గొన్నారు.

నేడు సర్వాయి పాపన్న వర్ధంతి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 1: సర్దార్ సర్వాయి పాపన్న 314వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు కలర్ సత్తన్న తెలిపారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అల్గునూరు బ్రిడ్జిపై ఉన్న సర్వాయి పాపన్న విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ వర్ధంతి కార్యక్రమానికి గౌడ కులస్తులందరు పాల్గొనాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయన విగ్రహం లేదా ఆయన చిత్రపటం వద్ద వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కోడూరి పరశురాం, పల్లి మహేశ్, రాష్ట్ర యూత్ ప్రధానకార్యదర్శి గొడిసెల రమేశ్, గొడిశేల సతీష్ పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు సన్మానం

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్1: మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబును పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. సోమవారం కరీంనగర్‌కు వచ్చిన మంత్రి శ్రీధర్ బాబును కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈకార్యక్రమంలో నాయకులు దిండిగాల మధు, చింతల కిషన్, మూల జైపాల్, బాసెట్టి కిషన్, జొన్నల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

వీణవంక,ఏప్రిల్ 1: మండలంలోని లస్మక్కపల్లి చివరి ఆయకట్టు వరి మొక్క జొన్న పంట పొలాలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ మార్కెట్ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చివరి ఆయకట్టు రైతులతో మాట్లాడి పంటలకు కాలువల ద్వారా నీరు వస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. నీరు పూర్తి స్థాయిలో అందుతుందని రైతులు తెలిపారు. వరి మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కేసీఆర్ పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు రైతులపై కపటప్రేమ చూపిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు నల్ల కొండాల్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, మ్యాకల సమ్మిరెడ్డి, దాసారపు లక్ష్మణ్, కొండాల్‌రెడ్డి, సమ్మయ్య, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్

జమ్మికుంట, ఏప్రిల్ 1: మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేనివని కమిషనర్ ఎండి ఆయాజ్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికురాలు దొడ్డె సమ్మమ్మ పదవీ విరమణ సందర్భంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు తమ విధులను ఎంతో శ్రద్ధతో చేస్తున్నారని తెలిపారు. కరోన సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేశారని గుర్తు చేశారు. సమ్మమ్మ 37సంవత్సరాలుగా ఎంతో శ్రద్ధతో పారిశుధ్య కార్మికురాలిగా ప్రజలకు సేవలు అందించిందని కొనియాడారు. కార్యక్రమంలో మేనేజర్ భూపాల్‌రెడ్డి, సానిటర్ ఇన్స్‌పెక్టర్ బోళ్ల సదానందం, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

జమ్మికుంట, ఏప్రిల్ 1: జమ్మికుంట పట్టణంలో మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై సోమవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కు కలిగిన వారు ఓటర్ లిస్టులో తమ పేరు, కుటుంబ సభ్యులు పేర్లు సరి చూసుకోవాలని సూచించారు. తప్పులు దొర్లిన, కొత్త ఓటు కోసం అయిన ఆన్‌లైన్ రిజిస్టర్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఎంసి శ్రీవాణి, ఎడిఎంసి మల్లేశ్వరి, జీవనజ్యోతి పట్టణ సమాఖ్య అధ్యక్షులు రాణి, కార్యదర్శి మౌనిక, సీఎల్ ఆర్పీలు జ్యోతి, మంజుల పాల్గొన్నారు.

వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు



వృథాగా పోతున్న నీరు

హుజూరాబాద్, ఏప్రిల్ 1: హుజూరాబాద్‌లో నల్లా నీరు వృథాగా పోతోంది. నాలుగేళ్ల క్రితం హుజూరాబాద్ పట్టణంలో సుమారు రూ. 18కోట్లతో మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికీ నల్లా పైపులు వేశారు. వాటికి మాత్రం కంట్రోల్ వాల్ సెట్‌ను బిగించడం మరిచిపోయారు. దాంతో నీళ్లన్నీ రోడ్డుపై వృథాగా పోతున్నాయి. గృహ వినియోగదారులు కూడా నల్ల నీరు వృథాగాపోతున్నా పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మున్సిపల్ అధికారులు నల్ల నీరు వృథా కాకుండా అవగాహన కల్పించడంతో పాటు మిషన్ భగీరథ పైపులకు కంట్రోల్ వాల్ సెట్‌లను అందజేయాలని పలువురు కోరుతున్నారు.

మల్లన్న పట్నాలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి హాజరు

తిమ్మాపూర్, ఏప్రిల్ 1: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అల్గునూరులో గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న మల్లన్న పట్నాలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మల్లన్న దేవున్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

-బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి -జిల్లావ్యాప్తంగా తహసీల్దార్లకు వినతిపత్రాల అందజేత



డీఆర్‌వో పవన్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు



హుజూరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భగత్‌నగర్, ఏప్రిల్ 1: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై కనికరం లేదన్నారు. సాగునీరు లేక రైతుల పంటలు ఎండుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకట్‌రెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, రాష్ట్రకార్యవర్గ సభ్యుడుకోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిని మల్లేశం, రంగు భాస్కర్‌చారి, జిల్లా అధికార ప్రతినిధులు అలివేలు సమ్మిరెడ్డి, జానపట్ల స్వామి తదితరులుపాల్గొన్నారు.

●**కరీంనగర్ రూరల్:** రైతులను ఆదుకోవాలని కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కడార్ల రతన్‌కుమార్, కొత్తపల్లిపట్టణ అధ్యక్షుడు కెంచ శేఖర్, వేముల అనిల్, అంజన్‌కుమార్, కొప్పుల హరిప్రసాద్, ఎర్రోళ్ల ప్రదీప్, స్వర్గం నర్సయ్య, వేముల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్ మండల తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

●**హుజూరాబాద్:** పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వొడ్నాల విజయ్, కొండాల్‌రెడ్డి, రావుల భాస్కర్‌రెడ్డి, రాజు, వేణు, వాసు, శశిధర్, సంజీవరెడ్డి, మహేష్, శ్రీనివాస్, ప్రభాకర్, సారయ్య, వెంకటేష్, భాస్కర్ పాల్గొన్నారు.

●**శంకరపట్నం:** రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జైపాల్, నరేందర్, అశోక్, సాగర్, సంపత్, రాములు, సంపత్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●**చిగురుమామిడి:** సాగు నీరు లేక పంటలు ఎండిపోయిన రైతులకు పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం పలు డిమాండ్స్‌తో కుడిన వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కంది శంకర్, కార్యదర్శి కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మామిడి రమేశ్, సాగర్‌రెడ్డి, కోహెడ శేఖర్, గుంటి సతీష్, గంద్రత్ రామన్న, కోమిటిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి, కొత్త రాజు పాల్గొన్నారు.

●**మానకొండూర్ :** రైతుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు రాపాక ప్రవీన్ మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎడబోయిన రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కత్తి ప్రభాకర్, శ్రీనివాస్, భూమయ్య, సునంద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

●**వీణవంక:** మండలంలోని రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నాయకులు ఇన్‌చార్జి తహసీల్దార్ నిజామొద్దీన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, జిల్లా కార్యదర్శి చెన్నమాధవుని నర్సింహరాజు, నాయకులు తిరుపతి రెడ్డి, రమణ రెడ్డి, సంతోష్, శ్రీనివాస్, రాకేష్, రాజు, రాంమూర్తి, అజయ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●**జమ్మికుంట రూరల్:** పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున నష్టపరిహారం అందించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్ అన్నారు. సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రాజేందర్, పల్లపు రవి, రాగూర్ రాజేష్, కైలాస్‌కోటి గణేష్, మోతె స్వామి, ఇటుకల స్వరూప, తుడి రవిచంద్రారెడ్డి, బి రాజేష్, రాగూర్ రాకేష్, మోడెం రాజు, రాము, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

●**ఇల్లందకుంట:** రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు నీరు వదలకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ. 20వేల నుంచి 30వేల వరకు నష్టపరిహారం అందించాలన్నారు. ప్రతి రైతును రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సాంబన్న, షీఫీ, రమేష్, రాజేందర్, శంకర్, పవన్‌రెడ్డి, శ్రీనివాస్, రాజన్న, రమేష్, రాజు, సురేందర్‌రెడ్డి, దుర్గయ్య, సమ్మయ్య, అజయ్, విజయ్, విశ్వేష్ తదితరులు పాల్గొన్నారు.

●**గన్నేరువరం:** పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల పరిహారం ఇవ్వాలని తహశీల్దారు కార్యాలయంలో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు నగునూరి శంకర్, బండి తిరుపతి, మునిగంటి సత్తయ్య, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర శ్రీకాంత్, చిగురు సంజీవ్, రాజిరెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 1: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల నగునూరులో సోమవారం మ్యాజిక్ ఫౌండేషన్ ఇండియా ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. వారం రోజుల పాటు జరగనున్న కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చి వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ పవిత్ర, ట్రైనర్ తిరుపతి, శివ, కళాశాల ప్రిన్సి పాల్ సమత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుష్మ పాల్గొన్నారు.

'ఈజీఎస్‌ను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం'

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 1: గ్రామాలలోని కూలీలకు ఉపాధిని కల్పించే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని టీపీసీసీ సీనియర్ వైస్ చైర్మన్ వెన్నరాజమల్లయ్య దుయ్యబట్టారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్ ద్వారా లేఖ రాసినట్లు తెలిపారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం గ్రామాలలో రెక్కాడితే గాని డొక్కాడని కోట్లాది శ్రమజీవుల పాలిట అన్నపూర్ణగా పంటసిద్ధికెక్కిందని పేర్కొన్నారు.

అడిగినవారికి లేదనకుండా ఉన్న గ్రామంలోనే కూలీలకు సంవత్సర కాలంలో కనీసం వందరోజుల పని కల్పించడం ద్వారా పల్లెల్లో కూలీలకు ఆసరాగా ఉందని టీపీసీసీ సీనియర్ వైస్ చైర్మన్ వెన్నరాజమల్లయ్య అన్నారు. ఇటువంటి పథకానికి సంబంధించి కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయం కోట్ల మంది గ్రామీణ కూలీలను నిస్సహాయ స్థితిలోకి నెట్టేసిందన్నారు. 2024 సంవత్సరం నుంచి జాబ్‌కార్డును ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాతో అనుసంధానాన్ని తప్పనిసరి చేశారని, సాంకేతిక సమస్యలు, ఇతరత్రా కారణాలతో అనుసంధానం సాధ్యపడని కోట్లాది గ్రామీణ కూలీలకు ఇది పెను శాపంగా పరిణమించిందన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలను దృష్టిలో ఉంచుకొని ఉపాధి కూలీల దినసరి వేతనం రూ.300 నుంచి రూ.600లకు పెంచాలన్నారు.

'నేటి రైతు దీక్షను విజయవంతం చేయాలి'

భగత్‌నగర్, ఏప్రిల్ 1: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ మంగళవారం పార్లమెంట్ కార్యా లయం వద్ద తలపెట్టిన రైతు దీక్షను విజయవంతం చేయాలని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు పిలుపు నిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, పంటచేతికొచ్చే సమయంలో సాగునీరు లేక రైతులు అల్లాడుతుంటే నిమ్మకు నీరెత్తినట్లు ఉందన్నారు. పార్లమెంటు పరిధిలో బీజేపీ శ్రేణులంతా రైతాంగానికి అండగా నిలువాలన్నారు. రైతు దీక్షతో పాటు రైతులు ప్రధానంగాఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ స్థానికంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మద్దతు ధరతో పాటు, 500 బోనస్ అందించాలనే డిమాండ్‌తో చేపట్టబోయే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

'విభజన హామీలను అమలు చేయాలి'



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ 1: తెలంగాణ విభజన హామీలను కేంద్రం ప్రభుత్వం అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీసు బేర్ల సమావేశంలో ఆయన మాట్లడుతూ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కేంద్రంలోని బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించడానికి విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టాను సారంగా వ్యవహరిస్తు ముందస్తు అడ్మిషన్లు చేస్తు ప్రచారాలను నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఐదేళ్లలో కరీంనగర్ నియోజక వర్గంలో విద్యార్థులు, యువకుల కోసం ఎంపీగా బండి సంజయ్ తెచ్చిందిఏమి లేదన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలను విద్యను వ్యాపారంగా మార్చాయన్నారు. అడ్మిషన్ల కోసం ప్రచారం నిర్వహిస్తు వేలాది రూపాయలు దండుకుంటున్నాయన్నారు.

ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు మోదీ రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. ఈసమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, చాట్ల సమ్మయ్య, మామిడిపల్లి హేమంత్, కేశబోయిన రాము, కనకం సాగర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అఖిల్ కుటుబ సభ్యులకు పరామర్శ

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 1: ఇటీవల గుండెపోటుతో మరణించిన కాంగ్రెస్‌పార్టీ మైనార్టీసెల్ నగరశాఖ అధ్యక్షుడు సయ్యద్ అఖీల్ కుటుంబ సభ్యులను సోమవారం రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు పరామర్శించారు. అఖీల్ కుటుంబాన్ని ఆదుకుంటామని, ధైర్యంగా ఉండాలని ఈ సందర్భంగా మంత్రి వారికి భరోసా ఇచ్చారు. మంత్రి శ్రీధర్‌బాబు వెంట రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ తాజ్, రాయకులు సమద్‌నవాబ్, ఇర్ఫాన్, పెద్దిగారి తిరుపతి, లయాక్, కొట్టె ప్రభాకర్, షేక్ షహెన్‌షా, అష్రఫ్, మాసుంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్1: కరీంనగర్ వావిలాలపల్లిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడని కరీంనగర్ మూడో ఠాణా సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతుడిని గుర్తుపట్టిన వారు వెంటనే మూడో ఠాణా సీఐ ఫోన్ 8612670763కి సమాచారం అందించాలని కోరారు.

పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి సన్మానం

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 1: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీ, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని సోమవారం కరీంనగర్‌లో కాంగ్రెస్‌పార్టీ దళిత నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నాయ కులు గడ్డం వంశీతో సుదీర్ఘంగా చర్చించి గడ్డం వంశీని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. వంశీని సన్మానించి అభినందనలు తెలిపిన వారిలో దళిత కాంగ్రెస్ నాయకులు వెన్న రాజ మల్లయ్య, నాత శ్రీనివాస్, విక్టర్, కాడే సూర్య నారాయణ, కాడే శంకర్, కుంభాల రాజ్‌కుమార్, దండి రవీం దర్, గూడ కనకయ్య, దారం ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాఫ్ట్‌వేర్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 1: సాఫ్ట్‌వేర్ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు మెరుగైన సాఫ్ట్‌వేర్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.శంకర్ అన్నారు. సోమవారం మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐఎంఎల్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీవోప్స్ వర్క్‌షాప్ ప్రారంభోత్సవంలో మాట్లాడారు. వృత్తి నైపుణ్యం ప్రయోగశాలలో, వర్క్‌షాపులో నేర్చుకోవాలన్నారు. ఈ శిక్షణ ఆన్‌లైన్ విధానంలో ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఏఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ ప్రవీణ్ కుమార్‌రావు, డాక్టర్ యోగేష్ పుండలిక్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కె. రవీంద్రబాబు, కార్యశాల సమన్వయకర్త ప్రశాంత్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నవోదయ పాఠశాలకు ఎంపిక

రామడుగు, ఏప్రిల్ 1 : రామడుగులోని ప్రగతి పాఠశాలకు చెందిన బొల్లాడి ఆరాధ్య నవోదయ పాఠశాలకు ఎంపిక అయింది. సోమవారం ఆరాధ్య పాఠశాల కరస్పాండెంట్ రాధాక్రిష్ణ, డైరెక్టర్లు శ్రీనివాస్, ఆనంద్, భూమయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మునీందర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం సన్మానించారు.

కటిక సేవా సంఘం ఎన్నిక

హుజూరాబాద్, ఏప్రిల్ 1: హుజూరాబాద్ పట్టణ కటిక సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కోయల్‌కార్ రమేష్, అధ్యక్షుడిగా మిర్యాలకార్ చందాజీ, ఉపాధ్యక్షుడిగా దుర్గాజీ, కార్యదర్శిగా బాలాజీ, సంయుక్త కార్యదర్శిగా యాదగిరి, కోశాధికారిగా శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా జమల్‌పూర్ అనిల్, కోయల్‌కార్ సాయిరాం, ముఖ్య సలహాదారులుగా తుక్కాజీ, జమాల్‌పూర్ సంతోష్, కోయల్‌కార్ శ్రీనివాస్, రమేష్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొత్తగట్టులో కొనుగోలు కేంద్రం



ఇల్లందకుంట మండలం సీతంపేటలో..



గన్నేరువరంలో ధాన్యం కొనుగోలు కేంద్రం

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 1: రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని మార్కెట్ కార్యదర్శి గూగులోతు రెడ్డి నాయక్ అన్నారు. సోమవారం పాత మార్కెట్ యార్డులో ప్రాథమిక వ్యవ సాయ సహకార కేంద్రం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ధాన్యం ఇంటి వద్దనే ఆరబెట్టి తీసుకురావాలని సూచించారు. గ్రేడ్ ఏ రకం రూ.2203, కామన్ రకం రూ.2183 చొప్పున ప్రభుత్వం మద్దతు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో పిఏసిఎస్ సిఈవో ఒజ్జ రవిందర్, సెంటర్ ఇంచార్జ్ దుగ్గినాల తిరుపతి, సిబ్బంది అనిల్, దేవేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● చిగురుమామిడి: రైతులు ధాన్యం విక్రయించేందుకు మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శైలజ అన్నారు. మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాల్ ధర రూ.2,203, కామన్ గ్రేడ్ ధాన్యం ధర రూ.2,183 గిట్టుబాటు ధరలను రైతులు వినియోగించుకోవాలని అన్నారు. గ్రామాల్లోకి వచ్చే మధ్య దళారుల మాటలను నమ్మి ధాన్యం విక్రయించి ఇబ్బందులు తెచ్చుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం మట్టెల సంపత్‌కుమార్, సిసిలు పెండోట సత్యనారాయణ, వెంకటమల్లు, చిగురుమామిడి వీఓ అధ్యక్షురాలు పోలోజు చైతన్య, సంఘాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● గన్నేరువరం: మండల కేంద్రంలో సోమవారం ఐకేపి ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ నిర్వాహకులు, హమాలీలు, రైతులతో కలిసి ప్రారంభించారు. ఎలక్షన్ కోడ్ ఉన్నందున తదుపరి 15 రోజుల వరకు మండలంలోని వివిధ గ్రామాలలో కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

● శంకరపట్నం: శంకరపట్నం మండలం మెట్‌పల్లి సొసైటీ పరిధిలోని కొత్తగట్టు గ్రామంలో సీఈవో సదయ్య సోమవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్నిప్రారంభించారు. దళారులకు ధాన్యం అమ్మి రైతులు మోసపోవద్దన్నారు. నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.

● సైదాపూర్: మండలంలోని రాయికల్ తండా గ్రామంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు పండించిన వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కుమారస్వామి, సీసీ జమున, పంచాయతీ కార్యదర్శి విష్ణు, వీవో అధ్యక్షురాలు అమిత, వీవోఏ నిర్మల రైతులు పాల్గొన్నారు.

● ఇల్లందకుంట: ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని రైతులు దళారులకు అమ్మి మోస పోవద్దని ఇల్లందకుంట సింగిల్ విండో కార్యానిర్వాహణాధికారి ఆదిత్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో సీతంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఈవో ఆదిత్య ప్రారంభించారు. కనీస మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి రూ. 2203, కామన్ ధరకు రూ. 2180 ధర పొందాలన్నారు.



జమ్మికుంటలో కొనుగోలు కేంద్రం



చిగురుమామిడిలో కొనుగోలు కేంద్రం

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన

గంగాధర, ఏప్రిల్1: గంగాధర వివేకాంద విద్యాలయం విద్యార్థులు అద్వైత నవోదయ, సైనిక్ పాఠశాలలో రిషేందర్, అభిషేక్, జశ్వంత్‌లు ఆరవ తరగతిలో హేమంత్ సైనిక్ కళాశాలలో సీట్లు సాధించగా సోమవారం వారిని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలన్నారు. ఒకే పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు నవోదయ, సైనిక్ స్కూల్‌కు ఎంపిక కావడంతో విద్యార్థులను, పాఠశాల యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి, ప్రధానోపాధ్యాయులు అనంత రెడ్డి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శ

తిమ్మాపూర్, ఏప్రిల్1: మండలంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా చదువుతున్న విద్యార్థి అభిలాష్ కళాశాల నుంచి బయటకు వెళ్లి మార్చి 27న తిమ్మాపూర్‌లోని ఓ వ్యవసాయ బావిలో శవమై దొరికిన విషయం విదితమే. మృతి చెందిన విద్యార్థి భూపాలపల్లి జిల్లా కాటారం మండలం, దామరకుంట గ్రామానికి చెందిన వ్యక్తి. వారి కుటుంబాన్ని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం రాత్రి ఎల్‌ఎండి పోలీస్‌స్టేషన్ సమీపంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కళాశాల యాజమాన్యం విద్యార్థుల రక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, విద్యార్థి అభిలాష్ మృతిపై పోలీసులు అన్ని కోణాల్లో విచారించాలని, ప్రభుత్వ పరంగా విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి శ్రీధర్‌బాబు భరోసా ఇచ్చారు. విద్యార్థి అభిలాష్ కుటుంబ సభ్యులు తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని ఎల్‌ఎండి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై చేరాలు తెలిపారు.



విద్యార్థి కుటుంబీకులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు